ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం


నర్సంపేట : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


దుగ్గొండి : ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్


వర్ధన్నపేట : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


నెక్కొండలో..


ఖానాపురంలో..


రాయపర్తి : బహుమతి ఇస్తున్న తహసీల్దార్

నర్సంపేట : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆ కళాశాలలో ఐక్యూఏసీ, రాజనీతి శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఓటరు నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. 18 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.రమేశ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీనాథ్, త్యాగయ్య, కుమారస్వామి, విష్ణు, ప్రసూన, శైలజ ఆపల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను తహసీల్దార్ రవిచంద్రారెడ్డి సత్కరించారు. నూతన ఓటర్లకు ఓటు గుర్తింపు కార్డులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, పుచ్చకాయల కృష్ణారెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

వర్ధన్నపేట : పట్టణంలో మున్సిపాల్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ర్యాలీ తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోతు అరుణ, మున్సిపల్ కమిషనర్ జోనా, ఎంఈఓ రంగయ్య పాల్గొన్నారు.

నెక్కొండ : తహసీల్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలు, బూత్ లెవల్ అధికారులతో తహసీల్దార్ రాజ్‌కుమార్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. ఓటునను వజ్రాయుధంగా అభివర్ణించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు కక్కెర్ల పెద్ద కొమురయ్య, బాదావతు నాగయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, ఆర్ఐ నరేందర్ పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ అరుట్ల శేషాచారి మాట్లాడారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ పరాచికపు సదానందం, అధ్యాపకులు సరిత, విజయ్‌కుమార్, రవికుమార్, తిరుపతమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు తహసీల్దార్ శ్రీనివాస్ బహుమతులు అందించి మాట్లాడారు. ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ ఐత రాంచందర్, డిప్యూటీ తహసీల్దార్ సూర్య, హెచ్ఎం గారె కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లు గంగిశెట్టి శకుంతల, నల్ల కిష్టయ్యలను జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ నానబోయిన రాజారాం, నాయకులు పరికి కోర్నేల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బండి సంజయ్‌కు సన్మానం



వర్ధన్నపేట: బీజేపీ జాతీయ నేత బండి సంజయ్‌ను మాజీ ఎమ్మెల్యే, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హైదరాబాద్‌లో గురువారం సతీసమేతంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడారు. తన సేవలను గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తనపై మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


భద్రు (ఫైల్)

సంగెం : మద్యానికి బానిసగా మారి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన మండలంలోని నల్లబెల్లి శివారులోని తూర్పు తండాలో చోటుచేసుకుంది. ఎస్సై భరత్ కథనం ప్రకారం.. తండాకు చెందిన మూడు భద్రు (45) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో భార్యతో బుధవారం గొడవపడి భద్రు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు యత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల నివాళి



ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన భారతమ్మ, రంగాపురంలో యాకూబ్ తల్లి బేగం మృతి చెందగా వారి మృతదేహాలకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యర్ల జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను జగన్మోహన్‌రెడ్డి, హరిబాబు పరామర్శించారు. కార్యక్రమంలో బెడిపాల ఉపేందర్, లాల్‌సాహెబ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతదేహానికి..

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పల్లెపాటి మాధవరావు గురువారం మృతి చెందగా ఆయన మృతదేహానికి తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిలర్ గటిక మల్లయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని గంగదేవిపల్లికి చెందిన చల్ల ఎల్లమ్మ మృతి చెందగా బాధిత కుటుంబానికి మనుగొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలికిశోర్‌రెడ్డి అతడి బంధువు మల్లారెడ్డి ద్వారా గురువారం రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, నాయకులు కూసం రమేశ్, మాదాసి రాంబాబు, కందికొండ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

సంగెం : మండలంలోని లోహిత గ్రామానికి చెందిన దొమ్మటి యాకంబరం ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కొండిన్య పరపతి సంఘం ఆధ్వర్యంలో గురువారం రూ.10 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రతినిధి దొమ్మటి సంపత్‌గౌడ్, చెరుకు యాదగిరి, దర్శనం తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ఇన్‌చార్జ్‌ల నియామకం


రాజ్‌కుమార్


సుధాకర్

దుగ్గొండి: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్‌లుగా శానబోయిన రాజ్‌కుమార్, యాదగిరి సుధాకర్‌లను నియమిస్తూ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. మండలంలోని గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటు నమోదు చేసుకునేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. ఎన్నికలో పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం


పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ యమునారెడ్డి

నెక్కొండ : ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం, హైస్కూల్ సెంటర్‌తోపాటు అంగడి (వారాంతపు సంత) ఆవరణల్లో చేపట్టిన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడంతో కొన్నేళ్లుగా మహిళలు, బాటసారులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న క్రమంలో మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో నిర్మించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. సఫాయి కర్మచారి సంఘం ఆధ్వర్యంలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈఓ సదానందం, ఉపసర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, వార్డు సభ్యులు ఇమాంబీ, ఈదునూరి దిలీప్, సింగం ప్రశాంత్, తోట సాంబయ్య, సఫాయి కర్మచారి సంఘం అధ్యక్షుడు అమిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రాజ్‌భవన్' తేనీటి విందుకు ఆహ్వానం

పర్వతగిరి : రాజ్‌భవన్ ఆవరణలో జరిగే గణతంత్ర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన తేనీటి విందుకు హాజరు కావాలని తెలుపుతూ ఎంపీడీఓ చక్రాల సంతోశ్‌కుమార్‌కు, మండలంలోని మంగ్యతండా సర్పంచ్ నేతావత్ ఈర్యానాయక్‌కు రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను ఎంపీడీఓ, సర్పంచ్ గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు. 2022 ఆగస్టు 28న ప్రసారమైన మన్‌కీ బాత్ కార్యక్రమంలో మంగ్యతండాలోని అమృత్ సరోవర్ గురించి దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారని చెప్పారు. అమృత్ సరోవర్ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన క్రమంలోనే తమకు గవర్నర్ తలపెట్టిన తేనీటి విందుకు ఆహ్వానం వచ్చిందని తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు


సీపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని 16వ డివిజన్ జాన్‌పాకకు చెందిన తేజావత్ బుజ్జి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. గిరిజన మహిళపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ తొలుత వరంగల్‌లోని చింతల్ బ్రిడ్జి వద్ద గోర్‌సేన, గోర్‌బంజారా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. దీంతో ఆందోళనకారులతో మామునూరు, వరంగల్ ఏసీపీలు సతీశ్‌బాబు, బోనాల కిషన్ మాట్లాడారు. కేసు నమోదు చేయిస్తామని హామీ ఇచ్చి ఆందోళనకారులను శాంతింపజేశారు. కేసు నమోదు చేయాలంటూ బంజారా నాయకులు ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం


ఖానాపురం : విరాళం అందజేస్తున్న నాయకులు


రాయపర్తి : విరాళం అందిస్తున్న క్రాంతికుమార్

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ నాయకులు గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ఎస్సై మాధవ్‌కు గురువారం రూ.30 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నివారించొచ్చని చెప్పారు. విరాళం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శాఖమూరి హరిబాబు, తక్కళ్లపల్లి రమేశ్, వల్లెపు శ్రీనివాస్, దేవినేని వేణుగోపాల్‌రావు, బోడ పూల్‌నాయక్, మచ్చిక అశోక్, గంగాపురం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సెకండరీ స్కూల్‌కు ..

రాయపర్తి : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం చంద్ర చంద్రశేఖర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు క్రాంతికుమార్ గ్రామంలోని జెడ్పీ సెకండరీ స్కూల్ హెచ్ఎం నాగకుమారికి క్రీడా పరికరాల కొనుగోలు కోసం రూ.5,016లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. త్వరలో క్రీడా పరికరాలు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సమ్మయ్య, దుర్గాచారి, శ్రవణ్‌కుమార్, సృజన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు మంత్రి వెంకట్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'

నర్సంపేట రూరల్ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని రాజపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు పథకం డబ్బులు రైతుల ఖాతాలో వేయకపోగా అడిగిన వారిని చెప్పుతో కొట్టాలని వ్యాఖ్యలు చేయడం రైతులను అవమానించడమేనని తెలిపారు. మంత్రి మాటలను వెనక్కి తీసుకోవాలని హితవు పలికారు.

28న ఆర్‌పీఐ సమీక్ష సమావేశం

నర్సంపేట : హనుమకొండలోని రాంనగర్ ఈనెల 28న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ బొజ్జ తారకం రాష్ట్ర స్థాయి పునర్నిర్మాణ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాదులు, రాజకీయ విశ్లేషకులు, బహుజన ఉద్యమ నాయకులు, మేధావులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అంబేడ్కర్‌వాదులు, బహుజన నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కర్పూరీ ఠాకూర్‌కు 'భారతరత్న' అభినందనీయం

చెన్నారావుపేట : బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న దక్కడం అభినందనీయమని నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్ల మురళి తెలిపారు. మండల కేంద్రంలో ఆయన గురువారం మాట్లాడారు. ఠాకూర్ సామాజిక న్యాయం కోసం నిర్విరామంగా కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సమ్మెట భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు ఎల్ల మల్లయ్య, మండల కోశాధికారి కుమారస్వామి, కార్యదర్శి ఎల్ల రమేశ్, సహాయ కార్యదర్శి జంపాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన మేకల కుమారస్వామి ఇంట్లో గురువారం వంట చేస్తున్న క్రమంలో గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. అగ్నిమాపక అధికారి భద్రయ్య ఆధ్వర్యంలోని సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను చల్లార్చింది. సుమారు రూ.15 వేల విలువైన వంట సామగ్రి దగ్ధమైనట్లు భద్రయ్య తెలిపారు.

మద్ది మేడారం జాతర షాపులకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

నల్లబెల్లి : మండలంలోని నాగరాజుపల్లి సమ్మక్క-సారలమ్మ మద్దిమేడారం జాతర సందర్భంగా షాపుల ఏర్పాటుకు జాతర ఇన్‌చార్జ్ ఎండోమెంట్ అధికారి భిక్షమాచారి గురువారం వేలం నిర్వహించారు. దేవాదాయ శాఖ మహబూబాబాద్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కవిత పర్యవేక్షించారు. కొబ్బరికాయలు, బెల్లం, కూల్ డ్రింక్స్, కోళ్ల విక్రయాలకు షాపులు ఏర్పాటు చేసుకునేందుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు వేలం నిర్వహించగా మొత్తం రూ.1,25,800 ఆదాయం వచ్చింది. మరో టెండర్లల్లో పుట్నాలు, మరమరాలు, లడ్డు, పులిహోర, అమ్మవార్ల ఫొటోల విక్రయానికి, పుట్టు వెంట్రుకల సేకరణకు వేలం నిర్వహిస్తామని భిక్షమాచారి చెప్పారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోనె శ్రీదేవి, ఆలయ కమిటీ చైర్మన్ గాదె సుదర్శన్‌రెడ్డి, నాయకులు ఎరుకల రవీందర్‌రెడ్డి, చిట్యాల సీతారాంరెడ్డి, చిట్యాల ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి హైస్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు


మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

నర్సంపేట : అయోధ్యలో జరుగుతున్న బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ వేడుకను పురస్కరించుకొని పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్లో గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. శ్రీరాముని జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. బాలరాముని పవిత్రమైన అక్షింతలతో ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎర్ర వెంకటరమణరెడ్డి, ఊర్మిళదేవి, స్వప్న, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ ఆలోజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కోదండరాంకు అభినందనలు


రాయపర్తి : పుష్పగుచ్ఛం అందజేస్తున్న దర్గయ్య


నల్లబెల్లి: బాణసంచా పేల్చుతున్న ఉద్యమకారులు

రాయపర్తి : గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన క్రమంలో తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్య దర్గయ్య నాయక్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ప్రొఫెసర్ కోదండరాంను దర్గయ్యనాయక్ హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం దర్గయ్యనాయక్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు, నిరుద్యోగ యువతకు ఇకనైనా న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

తెలంగాణ ఉద్యమకారుల సంబరాలు

నల్లబెల్లి : ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా నియమితులైన క్రమంలో మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారులు బాణసంచా పేల్చి స్వీట్లు పంచి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు మామిండ్ల ఐలయ్య, ఆకుల సాంబరావు, బట్టు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'జీఓ నంబర్ 55ను ఉపసంహరించుకోవాలి'


నర్సంపేట : మాట్లాడుతున్న దేవేందర్

నర్సంపేట : వ్యవసాయ ఉద్యాన యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించవద్దని, జీఓ నంబర్ 55ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుతంగా నిరసన తెలిపిన కార్యకర్తలపై పోలీసులు చేయి చేసుకుని దురుసుగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీపై మహిళా పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గమని చెప్పారు. ఝాన్సీని ఈడ్చికెళ్లిన మహిళా పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సాయి విశాల్, ఉమర్ ఫారుక్, ప్రశాంత్, శ్రీకాంత్, రాహుల్, ప్రణయ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : వ్యవసాయ యూనివర్సిటీ భూమిని హైకోర్టు నిర్మాణానికి ఇవ్వద్దంటూ ఆందోళన చేస్తున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై దౌర్జన్యం చేసిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ మండల ఇన్‌చార్జ్ గారె జయరాజ్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా నేతను జుట్టు పట్టుకొని లాగడం దారుణమని పేర్కొన్నారు.

దివ్యాంగురాలిపై దాడి చేసిన వారిని శిక్షించాలి


నిరసన తెలుపుతున్న కుమారస్వామి, తదితరులు

చెన్నారావుపేట : ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవిపేటలో ఆస్తి కోసం దివ్యాంగురాలిపై దాడి చేసిన ఆమె అన్న వదినలను శిక్షించాలని వికలాంగుల జేఏసీ రాష్ట్ర నాయకులు పల్లకొండ కుమారస్వామి, నల్లెల రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిరసన తెలిపారు. అనంతరం కుమారస్వామి, రాజయ్య మాట్లాడారు. దివ్యాంగురాలిపై దాడిని ఖండించారు. వికలాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం నిందితులపై చర్యలు తీసుకోవాలని, దివ్యాంగురాలికి న్యాయం చేయాలని కోరారు. దివ్యాంగులకు సమాజం రక్షణగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అసద్, ఆకులపల్లి ఉప్పలయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు మొక్కులు



నర్సంపేట రూరల్ : ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డి గెలుపొందాలని కోరుతూ మొక్కిన నేపథ్యంలో నర్సంపేట మండలంలోని ముగ్ధుంపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ చీకటి స్వరూప, వార్డు సభ్యులు వెల్లండి భారతి, కోల మధులత ఇతర మహిళలతో కలిసి గ్రామదేవతలకు గురువారం మొక్కులు చెల్లించారు. బొడ్రాయి, కనకదుర్గమ్మ, పెద్దమ్మతల్లి, పోచమ్మతల్లి, బీరన్న ఆలయాల్లో మొక్కులు చెల్లించారు. అనంతరం జంతువును బలి ఇచ్చారు. కార్యక్రమంలో నాంపెల్లి రజిత, కుండె విజయ, కోల అనసూయ, కోల మౌనిక, మామిడాల రమ, వతంగి రమ, బైరగోని వెంకటలక్ష్మి, తాడెం సరోజన, అల్లి కల్పన, కోల వసంత, పైడిపల్లి భావన, కోల సమ్మక్క, ఇస్లావత్ అమృత, ఇస్లావత్ రమ, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.